క్లుప్తంగా

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కులను తీర్చుకునేందుకు దేవాలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

కొనసాగుతున్న ఆందోళనలు



మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతకు వినతి పత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. సోమవారం తొమ్మిదో రోజు వాటర్ వర్క్స్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రాలను అందించారు.

పెళ్లి వేడుకల్లో డీజేలకు అనుమతిలేదు

గోనెగండ్ల: పెళ్లి వేడుకల్లో డీజేల ఏర్పాటుకు అనుమతి లేదని సీఐ గంగాధర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెళ్లి వేడుకల్లో భాగంగా ఊరేగింపు సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే డీజేలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తక్కువ శబ్దం వచ్చే మైక్, డెక్కులకు కూడా డీఎస్పీ నుంచి అనుమతి పొందాలన్నారు. అది కూడా 70 డెసిబుల్స్ వరకు, రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి ఇవ్వబడునని తెలిపారు.

గోకులం షెడ్లకు బిల్లులు చెల్లించాలి

కోసిగి: పశువుల సంరక్షణ కోసం రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లకు పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లించాలని మంత్రాలయం తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు ఎం.గోపాల్, డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయక కార్యదర్శి ఓంకార్ స్వామి కోరారు. సోమవారం స్థానిక పశువుల వైద్యశాలలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అక్కడి సిబ్బంది బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2014 వ సంవత్సరంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఆనాడు గోకులం షెడ్‌లు మంజూరు చేసిందన్నారు. రైతులు ఆనాడు నిర్మించిన వాటికే ఇంతవరకూ పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించేలా చూడాలని, కొత్తగా నిర్మించుకున్న వారికి ముందుగానే బిల్లులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో థామస్, శ్రీనివాసులు, మహాదేవా తదితరులు పాల్గొన్నారు.

సోమలగూడూరులో నేడు రెవెన్యూ సదస్సు

నందవరం : మండలంలోని సోమలగూడూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు అందుబాటులో ఉండి రైతులు అందించిన అర్జీలను స్వీకరించాలన్నారు. విధులకు హాజరు కాని రెవెన్యూ సిబ్బందికి శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా పాల్గొన్నారు.

ఫ్యూజ్‌ఆఫ్ కాల్స్ రిజిస్టర్‌ను రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలో ఎక్కడ లేని విధంగా పట్టణ పరిధిలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో పనిచేస్తున్న ఆపరేటర్లతో ఫ్యూజ్‌ఆఫ్ కాల్స్ రిజిస్టర్‌ను నిర్వహింపజేయడం పద్ధతి కాదని, దీనిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు రాముడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమేష్ కోరారు. సోమవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈ విజయరాజుకు వారు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘ నాయకులు హనీఫ్, జావిద్, దేవేంద్రరెడ్డి, రాఘవేంద్ర, వెంకన్న, నాగరాజులు పాల్గొన్నారు.

వామ్మో చిరుత!

➤ ఈ ఏడాది అక్టోబర్ 11న ఎమ్మిగనూరు మండల పరిధిలోని కోటేకల్ గ్రామ కొండల్లో చిరుత పులి కనిపించింది. ఆ చిరుత దాడిచేయడంతో జీ. రామకృష్ణకు చెందిన గొర్రె మృతి చెందింది. చిరుత దాడిలో గొర్రె మృతి చెందినప్పటి నుంచి గొర్రెల కాపరులు, పొలాలకు వెళ్లే రైతులు భయపడుతున్నారు. కోటేకల్ గ్రామం చుట్టూ ఉన్న కొండల్లో మూడు చిరుత పులులు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అవి ఎప్పుడు బయటకు వస్తాయో, ఎవరి మీద దాడి చేస్తాయోనని భయాందోళనలో చెందుతున్నారు. ఒక్క కోటేకల్ గ్రామంలోనే కాదు.. ఆదోని, పత్తికొండ డివిజన్ల పరిధిలోని పలు గ్రామాల్లో నిత్యం చిరుతపులులు సంచరిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు పొలాలకు, పశువుల మేతకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

- పెరిగిన చిరుతపులుల సంచారం
- కొండ ప్రాంతాల్లో తరచూ కనిపిస్తున్న వైనం
- భయాందోళనలో పశువుల కాపరులు, రైతులు
- వీటి సంచారంపై నిఘా ఉంచిన అటవీశాఖ
- తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన

ఆదోని సెంట్రల్: చిరుత పులులు గ్రామాల పరిసరాల్లోని కొండల్లో కనిపించడం, పెంపుడు జంతువులపై దాడులు చేయడం లాంటి ఘటనలు తరుచూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. చిరుత పులులు ఎక్కువగా అడవిలో ముఖ్యంగా రాళ్లతో కూడిన గుహల్లాంటి ఆవాసాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆదోని ఫారెస్ట్ అధికారులు చిరుతపులులు సంచరించే ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. అదే విధంగా చిరుతపులి ఎదురైతే ఏం చేయాలి, ఏం చేయకూడదు, దాని నుంచి తప్పించు కునే మార్గాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

19 ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

ఆదోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుత పులుల సంచారంపై నిఘా ఉంచేందుకు 19 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కోసిగి, గుడేకల్లు, కుప్పగల్, ఇస్వి, నవ్వలేకల్లు, పత్తికొండ, తుగ్గలి వంటి ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేశారు. గతంలో ఇస్వి, కుప్పగల్ తదితర ప్రాంతాల్లో పులి సంచారం చేస్తుందని వదంతులు వినబడ్డాయి. అధికారులు కూడా అప్రమత్తమయ్యి పరిస్థితులను సమీక్షించారు. ప్రతి రోజు రాత్రి పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



చిరుతపులుల ఆనవాళ్లు

☛ సెప్టెంబర్ 4న ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడేకల్ గ్రామ కొండల్లో చిరుతపులి ఉందనే పుకార్లు షికార్లు కొట్టాయి. కోలంట్ల అంజినయ్యకు చెందిన మేక తల లేకుండా కొండల్లో ప్రత్యక్షం అయింది. దీంతో గొర్రెలు, మేకల కాపరులు భయాందోళనలకు గురయ్యారు.

☛ అక్టోబర్ 3న పెద్దకడబూరు మండలం గుడేకల్ – హనుమాపురం కొండల్లో చిరుతపులి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. హనుమాపురం గ్రామానికి చెందిన ఎల్లప్ప అనే రైతు బర్రె దూడపై చిరుతపులి దాడి చేసి చంపింది. అటవీ శాఖ అధికారులు కంబదలదిన్నె వెటర్నటీ డాక్టర్‌తో పోస్టుమార్టం చేయించి నష్టపరిహారానికి సిఫారసు చేశారు.

☛ అక్టోబర్ 21న పెద్దకడబూరు మండల పరిధిలోని గవిగట్టు గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండలో చిరుతపులి కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండల్లో పెద్దమ్మగుడి పైభాగంలో చిరుత కనిపించింది.

☛ అక్టోబర్ 19న పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోణ గ్రామం కత్తుల గొట్టు కొండ సమీపంలో సాయంత్రం సమయంలో చిరుత సంచరిస్తున్నట్లు గమనించిన గ్రామ ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం చేరవేశారు. స్పందించిన వారు చిరుతపులి సంచిరించిన ప్రదేశాన్ని పరిశీలించి, గ్రామస్తులకు పలుసూచనలు చేశారు.

☛ పెద్దకడబూరు మండలం మేకడోన గ్రామం కత్తులకొండ, నరకొండ, జరిమానకొండ, సజ్జల కొండ ప్రదేశాల్లో చిరుతపులి సంచరిస్తుందని, పొలాలకు వెళ్లాలంటే భయమేస్తుందని, చిరుతపులిను పట్టుకోవాలని గ్రామస్తులు అక్టోబర్ 21న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్‌కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. ఇవే కాకుండా తరచూ ఎక్కడో ఒక చోట చిరుతపులులు కనిపిస్తూనే ఉన్నాయి.

చిరుతపులి కనిపిస్తే ఏం చేయాలి?

ఆవాసాలు దెబ్బతినడం, వేట, నీరు దొరకని సందర్భాల్లో చిరుతలు జనవాసాల్లోకి వస్తాయి. దీంతో మనుషులకు, జంతువులకు సంఘర్షణ జరుగుతుంది. చిరుత పులి ఎంత దూరంలో ఎదురు పడిందన్న అంశంపై ప్రమాద తీవ్రతపడి ఉంటుంది. దూరంగా ఉంటే మాత్రం అదే పక్కకు వెళ్లిపోతుంది. దాడిచేయాల్సిన అవసరం దానికి ఉండదు. మనకు దగ్గరగా ఎదురుపడితే దాడి చేసే అవకాశం ఉంది. అలాంటి సమయంలో మనం రెండు చేతులు పైకి ఎత్తి అరవాలి. అప్పుడు అక్కడ మనకంటే ఏదో పెద్ద జంతువు ఉందని భ్రమలో పడి పక్కకకు పోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలా అని దాడి చేయవని చెప్పలేం కానీ మన జాగ్రతలను మనం తీసుకోవాల్సి ఉంటుంది. అటవీ, కొండల ప్రాంతంలో వ్యవసాయం చేసే వారు తగు జాగ్రతలను తీసుకోవాల్సి అధికారులు చెబుతున్నారు.



అడవిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజశ్విని

తీసుకోవలసిన జాగ్రతలు

➡ పులి సంచారం చేసే అయా ప్రాంతాల్లో కొండల సమీపంలో గొర్రెలను, మేకలను ఉంచవద్దు, వాటిని మేపడానికి కొండ ప్రాంతంలోకి తీసుకొని వెళ్లరాదు.

➡ సూర్యోదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రాకూడదు.

➡ ప్రజలు ఒంటరిగా బయట తిరగరాదు. కొండ ప్రాంతాల్లోకి వెళ్లరాదు.

➡ చిన్న పిల్లలను బయట తిరగనివ్వకుండా చూసుకోవాలి.

➡ వీధి కుక్కలను జనవాసాలకు దూరంగా ఉంచాలి.

➡ చిరుతపులిని రాళ్లతో కొట్టరాదు, వాటికి ఎలాంటి వలలు గాని వేయరాదు. అలా చేసిన చట్టరీత్యా నేరం అవుతుంది.

➡ వన్యప్రాణాలను సంరక్షించటం రాజ్యాంగం మనకు ఇచ్చిన ప్రాథమిక హక్కు గనుక తగిన జాగ్రతలను తీసుకోవాలి.

పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం



చిరుతపులల సంచారం ఉన్న చోట ప్రతి రోజు రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వారు తీసుకోవాల్సిన జాగ్రతలపై కరపత్రాలను కూడా పంచుతున్నాం. ఆదోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కొంత మంది కావాలనే క్రియేట్ చేసే వదంతులను నమ్మి ఆందోళనకు గురి కావద్దు. అలాంటి సంఘటనలు ఎవైనా ఉంటే మా దృష్టికి తీసుకొని వస్తే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– తేజశ్విని, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఆదోని

471 మంది గర్భిణులకు స్కానింగ్

ఎమ్మిగనూరురూరల్: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా స్కానింగ్ పరీక్షలకు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి గర్భిణులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి వచ్చిన 471 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సుధ చెప్పారు. ఇదిలా ఉండగా పెద్ద సంఖ్యలో గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకోగా వారికి సరిపడ కుర్చీలు లేక అవస్థలు పడుతూ కింద కూర్చోవాల్సి వచ్చింది. స్కానింగ్ పరీక్షల్లో గైనకాలజిస్ట్ డాక్టర్లు సుజిత, ఫాతిమా ఉన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రభుత్వాసుపత్రికి స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల 9వ తేదిన స్కానింగ్ పరీక్షలకు వచ్చే గర్భిణులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని చెప్పారు.



స్కానింగ్ పరీక్షలకు పెద్ద సంఖ్యలో వచ్చిన గర్భిణులు

మంత్రాలయం పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం : మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు వార్షిక తనిఖీ చేపట్టారు. సోమవారం స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా కేసుల పరిష్కారంలో తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌కు సూచించారు. ఏడాదిలో కేసుల్లో సాధించిన లక్ష్యాలను తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

'సూర్య ఘర్'తో విద్యుత్ బిల్లు ఆదా

ఎమ్మిగనూరుటౌన్: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనతో ప్రజలకు విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు విద్యుత్ పరమైన ఎన్నో లాభాలున్నాయని విద్యుత్ శాఖ డీఈ విజయ్‌రాజు, ఏడీ నాగేంద్రకుమార్, ఏఈ ప్రసన్నరాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద పీఎం సూర్య ఘర్ ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ 120, 240, 360 యూనిట్ల సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రజలకు విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొంటే ప్రభుత్వ రాయితీ లభిస్తుందన్నారు.



మహిళలకు పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పిస్తున్న ఏఈ, సిబ్బంది

అభివృద్ధి పనులకు భూమిపూజ

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీసీ డ్రైనేజ్ వర్క్, కల్వర్టు నిర్మాణం, బనవాసి రోడ్డుకు సీసీ డ్రైనేజీ వర్క్, వెట్ మిక్స్ ఫిలింగ్ పనులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి తీసుకొని రాగా, తాము ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి సమస్యను వివరించామన్నారు. ఆయన ఆదేశాల మేరకు సుమారుగా రూ. 6లక్షల ఎంపీపీ నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కరన్న, అర్లప్ప, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యువరాజు, జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆదాము తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, సీపీఐ సీనియర్ నాయకులు కె.లక్ష్మారెడ్డి, కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను అప్పటి ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు వ్యతిరేకించారని, నేడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై తీవ్రమైన విద్యుత్ బిల్లుల భారం మోపారన్నారు. ట్రూ అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎ.విజయ్, లక్ష్మీనారాయణ, హర్షద్, కుమారస్వామి, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వెంకన్న, వై.టి.భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

కోసిగి: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన కూరగాయాల దిగుబడి వచ్చిందని రైతులు కొల్మాన్‌పేట, దుద్ది గ్రామ రైతులు కృష్ణయ్య, తాయన్న, భీమారెడ్డి, సతీష్, అనుమేష్ అన్నారు. సోమవారం కోసిగి స్త్రీ శక్తి భవన కార్యాలయ ఆవరణ ఎదుట కర్నూలు డీపీఎం ఆదేశాల మేరకు కొల్మాన్‌పేట యూనిట్ ఇన్‌చార్జ్ రాజన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆర్‌వైఎస్ఎస్ వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కొల్మాన్‌పేట, దుద్ది, కామన్‌దొడ్డి, కందుకూరు గ్రామాల్లో రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం ప్రకృతిలో లభించే పశువుల మూత్రం, పేడలతో తయారు చేసిన ఎరువుల వాడకంతో కూరగాయ పంటలు సాగుచేశారు.



కోసిగిలో స్త్రీ శక్తి భవన కార్యాలయం ఎదుట కూరగాయల ప్రదర్శన

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించి, అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ నిర్వహించి.. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ ఈఈ రవికుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హాస్టల్ వార్డెన్ ప్రమీలమ్మను సస్పెండ్ చేయాలి

ఆదోని డివిజన్‌లోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న సుగాలి ప్రమీలమ్మను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్ విద్యార్థినులతో పనులు చేయిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందన్నారు. ఈనెల 8వ తేదీన విద్యార్థులకు పూరి వడ్డించకుండా ఆయిల్ ఖర్చవుతుందని చపాతి వడ్డించిందన్నారు. అలాగే హాస్టల్ విద్యార్థులతో కాయగూరలు కోయించడం, నీటి సరఫరా చేయించడం తదితర పనులు చేయించుకుంటుందని చెప్పారు. పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు రసూల్, వీరేష్, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమరివీడు ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు నాగేశ్వర రావు

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఆరెకటిక నాగేశ్వర రావుకు తెలుగు తేజం జాతీయ పురస్కారం లభించింది. ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మార్కాపురంలో తెలుగు తేజం జాతీయ పురస్కార పదవ ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా 2024 సంవత్సరానికి గాను నిర్వహించిన కవి సమ్మేళనంలో నాగేశ్వర రావు రాసిన తెలుగు భాష గొప్పదనం అనే అంశానికి తెలుగు తేజం జాతీయ పురస్కారం అందజేశారు. ఈ అవార్డును ఆదరణ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొట్టి ముక్కల చిన్నకేశవులు చేతుల మీదుగా అందుకున్నట్లు నాగేశ్వర రావు సోమవారం తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు సోమవారానికి ఐదవ రోజుకు చేరుకున్నాయి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యల్లప్ప, శివకృష్ణ ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడులు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ మేనేజర్ వరప్రసాద్‌కు అందజేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులకు ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్రకుమార్, హంసరాజు, యూసుఫ్, రఘువీర్ పాల్గొన్నారు.

ఘనంగా కవి జాన్ మిల్టన్ జయంతి

ఆదోని సెంట్రల్: స్థానిక మిల్టన్ ఇంగ్లిష్ హైస్కూల్‌లో ప్రముఖ కవి, తత్వవేత్త సర్ జాన్ మిల్టన్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ మెచ్.రమేష్‌బాబు విద్యార్థులకు జాన్ మిల్టన్ జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, ఇన్‌చార్జ్ సుశీల, జయసింహా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కోసిగి: అనంతపురంలోని అంబేడ్కర్ భవనంలో ఈనెల 14, 15వ తేదీలలో నిర్వహిస్తున్న మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) తెలుగు ఉమ్మడి రాష్ట్రాల 10వ మహాసభలను జయప్రదం చేయాలని హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు కె. ఉరుకుందప్ప పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్నీ వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మహా సభలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేట్ స్కూల్స్‌లో ఎంపికైన విద్యార్థులు ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఈ ప్రైవేట్ స్కూల్స్ పేరేంట్స్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాది అడ్డాకుల తిమ్మప్ప డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. న్యాయవాది అడ్డాకుల తిమ్మప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.రంగప్ప, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేట్స్ స్కూల్స్‌లో 2022–23, 2023–24, 2024–25 విద్యా సంవత్సరంలో ఉచిత అడ్మిషన్ పొందిన విద్యార్థులను పలు విద్యా సంస్థలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. తాము హైకోర్టులో కేసు వేసి ఉచిత విద్య జీవోను రద్దు చేయించుకున్నాం కాబట్టి ఫీజు చెల్లించాల్సిందేనని నారాయణ, మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్, భాష్యం, కస్తూరి, గుడ్‌షెపర్డ్ స్కూల్స్ యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఏదైనా అడగాలనుకుంటే ప్రభుత్వాన్ని అడగాలని, విద్యార్థుల తల్లిదండ్రులను కాదని చెప్పారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

నేడు మంత్రాలయంలో విద్యుత్ అదాలత్

మంత్రాలయం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మంత్రాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ విజయరాజు తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో రిటైర్డు న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయస్వామి అధ్యక్షతన పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఏపీఎస్‌పీడీసీఎల్ (తిరుపతి) ఆధ్వర్యంలో మంత్రాలయంలో వేదిక ఏర్పాటు చేశామన్నారు. సదస్సులో విద్యుత్ వినియోగదారుల నుంచి దీర్ఘకాలిక సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. అదాలత్‌లో అక్కడిక్కడే పరిష్కారం లభిస్తోందని, వినియోగదారులు వేదికను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వేదికలో జిల్లా, ఎమ్మిగనూరు డివిజన్ వ్యాప్తంగా అధికారులు హాజరవుతున్నట్లు వివరించారు.

కోసిగి: మంత్రాలయం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వారి కార్యాలయంలో ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు కోసిగి విద్యుత్ శాఖ ఏఈ వీరేష్ సోమవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని సమస్యలను రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాని చెప్పారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మంగళవారం మంత్రాల యం సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు డివిజన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కారం పొందాలని సూచించారు. కార్యక్రమాన్ని ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదిక చైర్‌పర్సన్, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు.